ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 26 ఆగస్టు 2024



పాలకొండ సబ్‌కలెక్టర్‌గా యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పాలకొండ సబ్‌కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి యశ్వంత్‌కుమార్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. 2022 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన యశ్వంత్‌కుమార్ సబ్‌కలెక్టర్‌గా నియామకం కావడంతో ఆర్డీవోగా పని చేస్తున్న రమణకు బదిలీ జరిగింది. కానీ, ఆయన్ను ఎక్కడకు బదిలీ చేసింది ప్రభుత్వం ప్రకటించలేదు. ప్రస్తుతం రమణ సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా విధులు నిర్వహిస్తున్నారు. పాలకొండ సబ్‌కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి నియామకం కావడంతో రమణను ఐటీడీఏ పీవోగా కొనసాగిస్తారా లేదా ఎక్కడికైనా బదిలీ చేస్తారా అనేది వేచిచూడాలి.

ఎప్పటికి పూర్తవుతాయో?

- నిలిచిన ఏకలవ్య పాఠశాలల నిర్మాణాలు
- కేంద్ర నిధులను మళ్లించిన గత వైసీపీ ప్రభుత్వం
- పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు





నిలిచిన కోటికిపెంట ఏకలవ్య పాఠశాల భవనం

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఏకలవ్య పాఠశాలల భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. పదేళ్లవుతున్నా ఈ పనులు పూర్తికాలేదు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. దీన్ని సాకుగా చూపి కాంట్రాక్టర్ పనులు నిలిపేశాడు. దీంతో ఏకలవ్య పాఠశాలలను పరాయి పంచన నడపాల్సి వస్తోంది. ఇక్కడ పూర్తిస్థాయి సౌకర్యాల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2014లో యూపీఏ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వైరిచర్ల కిషోర్‌చంద్రదేవ్ ప్రత్యేక కృషితో ఉమ్మడి జిల్లాకు నాలుగు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరయ్యాయి. పాచిపెంట మండలం కోటికిపెంట, మక్కువ మండలం అనసభద్రతో పాటు భామిని, కురుపాం మండల కేంద్రాల్లో ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కొక్క పాఠశాలకు రూ.12 కోట్లు మంజూరు చేశారు. భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసే బాధ్యతను గిరిజన ఇంజనీరింగ్‌శాఖకు అప్పగించారు. 2016కే పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే, జిల్లాతో పాటు శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో ఏకలవ్య పాఠశాలల నిర్మాణాలకు సంబంధించిన టెండర్లను విశాఖకు చెందిన ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. ఒకే కాంట్రాక్టర్‌కు మొత్తం టెండర్లు దక్కడంతో కొంతమంది కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు. 2019లో ఈ సమస్య పరిష్కారమైంది. జిల్లాలోని ఏకలవ్య పాఠశాలలకు సంబంధించి ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. రెండేళ్లలో నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటికీ పూర్తికాలేదు. కాగా, ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించింది. దీనివల్ల కాంట్రాక్టర్‌కు భారీగా బిల్లులు పెండింగ్ ఉంది. కోటికిపెంట పాఠశాలకు సంబంధించి రూ.1.25కోట్లు, అనసభద్ర పాఠశాలకు రూ.3.25కోట్లు, కురుపాం పాఠశాలకు రూ.3.25కోట్లు, భామిని పాఠశాలకు సంబంధించి రూ.2కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీన్ని కారణంగా చూపిస్తూ కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. దీనివల్ల ఏకలవ్య పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పరాయిపంచల్లో అరకొర సౌకర్యాల నడుమ చదువులు సాగించాల్సి వస్తోంది. ప్రస్తుతం అనసభద్ర ఏకలవ్య పాఠశాల విద్యార్థులు డోకిశిల ఆశ్రమ పాఠశాలలో, కురుపాం ఏకలవ్య విద్యార్థులు పార్వతీపురం మోడల్ పాఠ శాలలో ఆశ్రయం పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇక్కడ పాఠశాల ఉంటే వారి ప్రాణాలు నిలిచేవి..

కోటికిపెంట ఏకలవ్య పాఠశాల భవనం పనులు పూర్తికాకపోవడంతో ఇక్కడి విద్యార్థులకు సరాయివలస ఆశ్రమ పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ నెల 16న ఇద్దరు ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయులు (హర్యానా) సరాయివలస ఆశ్రమ పాఠశాలకు వెళ్లేందుకు గెడ్డ వాగు దాటుతుండగా కొట్టుకుపోయి ప్రాణాలు వదిలిన విషయం తెలిసిందే. అదే కోటికిపెంటలో ఏకలవ్య పాఠశాల భవనం పనులు పూర్తయ్యుంటే వారు విధుల కోసం సరాయివలసకు వెళ్లే అవసరం ఉండేది కాదని, వారి ప్రాణాలు నిలిచేవాని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కలెక్టర్ సీరియస్..

ఏకలవ్య పాఠశాలల భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులపై సీరియస్ అ య్యారు. గత సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గిరిజన ఇంజనీరింగ్ అధికారులను ఈ విషయంపై ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశారని గిరిజన ఇంజనీరింగ్ అధికారి చెప్పారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సిన పనులు పూర్తిచేయకపోవడం ఏమిటన్నారు. మీ నిర్లక్ష్యంతో ఇద్దరు ఉపాధ్యాయుల ప్రాణాలు పోయాయన్నారు. భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ శోభికకు ఆదేశించారు.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో ఏకలవ్య పాఠశాలల భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. దీనిపై ఇప్పటికే కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీచేశాం. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాల్సిన మాట వాస్తవమే.

-మణిరాజు, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

తరలింపునకు రంగం సిద్ధం!

- శ్రీకాకుళం వెళ్లిపోనున్న గిరిజన సంక్షేమ కార్యాలయం
- ఆ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారుల చర్యలు
- ఆందోళనలో ఆదివాసీలు

(సీతంపేట)

సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయం ఆ జిల్లాకు తరలిపోనుంది. ఆ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. నాలుగు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన డీడీ కార్యాలయం పక్క జిల్లాకు వెళ్లిపోతుండడంతో ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఐటీడీఏ కేంద్రాలుగా నిర్వహిస్తున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాలను జిల్లా కేంద్రాల్లో నెలకొల్పాలని గత వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు అప్పట్లో సీతంపేట నుంచి డీడీ కార్యాలయాన్ని శ్రీకాకుళం తరలించడానికి అధికారులు సిద్ధపడ్డారు. ఈ విషయం తెలిసిన అప్పటి కలెక్టర్ దాన్ని అడ్డుకున్నారు. నూతనంగా కలెక్టరేట్ నిర్మాణం జరుగుతుందని, ఈ పనులు పూర్తయితే వీటిలో డీడీ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు ఐటీడీఏ కేంద్రంగానే కార్యాలయం నిర్వహించాలని చెప్పారు. దీంతో గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం తరలింపునకు అప్పట్లో బ్రేక్‌లు పడ్డాయి. రెండేళ్ల తర్వాత ఇదే అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. దీంతో గిరిజన సంక్షేమశాఖ కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి తరలించాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డీడీ కార్యాలయం శ్రీకాకుళం తరలింపునకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవానికి జిల్లాల పునర్విభజనకు ముందు జిల్లా గిరిజన సంక్షేమశాఖ పరిధిలో మందస, మెళియాపుట్టి, సీతంపేట సహాయ గిరిజన సంక్షేమాధికారులు సీతంపేట డీడీ ఆధీనంలో ఉండేవారు. కొత్త జిల్లాల పునర్విభజన తర్వాత మన్యం జిల్లాలో సీతంపేట సహాయ గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం విలీనమైంది. దీంతో గతంలో సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న 73 గిరిజన వసతిగృహాలు, పోస్టుమెట్రిక్ హాస్టళ్లు విభజించారు. పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న సీతంపేట, భామిని, వీరఘట్టం, పాలకొండ మండలాల్లో 18 వసతిగృహాలతో పాటు సీతంపేట సహాయ గిరిజన సంక్షేమశాఖ కార్యాలయాన్ని మన్యంలో విలీనం చేశారు. మిగిలిన మెళియాపుట్టి, మందస సహాయ గిరిజన సంక్షేమశాఖ కార్యాలయాలను శ్రీకాకుళం డీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీటి పరిధిలో 53 ఆశ్రమ వసతిగృహాలు, పోస్టుమెట్రిక్ హాస్టళ్లు కొనసాగుతున్నాయి. సీతంపేటలో డీడీ కార్యాలయం కొనసాగించడం వల్ల శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉన్న 16 మండలాలకు చెందిన ఆదివాసీలకు పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోపక్క కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్మాన్ కార్యక్రమం కింద 74 వేల మంది గిరిజనులకు ప్రయోజనం కల్పించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తూ 12 అంశాలపై ఆదివాసీల ఆర్థిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించింది. దీనిలో భాగంగా కొత్తూరు మండలం అడ్డంగి, నందిగాం మండలం పెద్ద గురువుపురం, మందస మండలం చీపి గ్రామాలను దత్తత తీసుకొని ఈ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా అభివృద్ధి పర్చేందుకు జిల్లా కలెక్టర్ దృష్టిసారించారు. అయితే ఈ గ్రామాలకు సంబంధించి జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతాయని, వీటిని దృష్టిలో ఉంచుకొని డీడీ కార్యాలయాన్ని శ్రీకాకుళం కేం ద్రంగా కొనసాగించాలని ప్రస్తుతం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సీతంపేట కేంద్రంగా నిర్వహిస్తున్న డీడీ కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి మార్చడానికి అధికారులు సిద్ధపడుతున్నారు. ఈ విషయమై డీడీ అన్నదొర వద్ద ప్రస్తావించగా.. కలెక్టర్ ఆదేశాల ప్రకారం డీడీ కార్యాలయం శ్రీకాకుళంలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



సీతంపేట కేంద్రంగా నిర్వహిస్తున్న డీడీ కార్యాలయం

ఆదివాసీల ఆందోళన..

నాలుగు దశాబ్దాల కిందట సీతంపేట ఐటీడీఏ కేంద్రంగా ఏర్పాటు చేసిన జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం శ్రీకాకుళం కేంద్రానికి తరలిపోతుండడంతో ఈ ప్రాంతానికి చెందిన ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మన్యం జిల్లాలో నాలుగు మండలాలు విలీనం కావడంతో పాలనాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు డీడీ కార్యాలయం కూడా శ్రీకాకుళం తరలిపోతుండడాన్ని ఆదివాసీలు జీర్ణించుకోలేకపోతున్నారు.

రెండు ఆస్పత్రుల్లోనే
డెంగ్యూ నిర్ధారణ

- పార్వతీపురం, పాలకొండల్లోనే అవకాశం
- డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహన్‌రావు

(జియ్యమ్మవలస)

పార్వతీపురం మన్యం జిల్లాలో ఎవరైనా చనిపోతే డెంగ్యూ జ్వరంతో మృతి చెందారనే మాట ఎక్కువగా వినిపిస్తోందని, అందులో వాస్తవం లేదని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.జగన్మోహనరావు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.



డాక్టర్ టి.జగన్మోహనరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో

ప్రశ్న: జిల్లాలో 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఎంతమందికి టెస్టులు చేశారు?

జవాబు: 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1.74 లక్షల మందికి, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1,85,584 మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేశాం. 2023-24లో 450 మంది, 2024-25లో ఇప్పటివరకు 1,150 మందికి పైగా మలేరియా జ్వర పీడితులను గుర్తించాం. వారికి తగు చికిత్స అందించి నయం చేయగలిగాం.

ప్ర: జిల్లాలో డెంగ్యూ పరీక్షలు ఎక్కడెక్కడ చేస్తారు?

జ: పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి, పాలకొండ ఏరియా ఆసుపత్రిలో మాత్రమే డెంగ్యూ పరీక్షలు చేస్తారు. మరెక్కడా చేయడానికి వీలులేదు.

ప్ర: ఎన్ని డెంగ్యూ కేసులు నమోదుయ్యాయి?

జ: 2023-24 ఆర్థిక సంవత్సరంలో 139, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 54 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా వీరఘట్టం, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, భామిని మండలాల్లో ఎక్కువగా నమోదయ్యాయి.

ప్ర: నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: డెంగ్యూ నివారణకు ఇండోర్ స్పేషియల్ స్ప్రే (ఐఎస్ఎస్) చేస్తాం. మలేరియా నివారణకు ఇండోర్ రెసిడ్యుల్ స్ప్రే (ఐఆర్ఎస్) చేస్తాం. జిల్లాలో 401 గ్రామాలు మలేరియా ప్రభావిత గ్రామాలుగా గుర్తించాం. మొదటి విడత స్ప్రేయింగ్ పూర్తి చేశాం. రెండో విడత ఇప్పటివరకు 384 గ్రామాల్లో జరిగింది. ఈ నెలాఖరుకు రెండో విడత స్ప్రేయింగ్ పూర్తి చేస్తాం.

ప్ర: డెంగ్యూ జ్వరానికి చికిత్స ఉందా?

జ: లేదు. కానీ లక్షణాలు బట్టి తగు చికిత్స అందిస్తాం.

ప్ర: కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూ నిర్ధారిస్తున్నారు?

జ: అలా చేయడం తప్పు. ఎవరికైనా డెంగ్యూ జ్వరం అని అనుమానం వస్తే జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సమాచారం ఇవ్వాల్సిందే. లేదంటే ఆ ఆసుపత్రులపై పూర్తి దర్యాప్తు చేసి తగు చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తాం.

ప్ర: బట్లభద్ర ఘటనపై దర్యాప్తు చేస్తున్నారా?

జ: బట్లభద్రలో తల్లీకుమార్తెల మరణానికి ప్రధాన కారణం వారు వెళ్లిన ప్రైవేటు ఆసుపత్రి నిర్లక్ష్యమే. వారు డెంగ్యూ అని చికిత్స అందించారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాం.

స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదగాలి: కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యులు లక్షాధికారులుగా ఎదగాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన లఖ్‌పతిదీదీ కార్యక్రమంలో మహిళా సంఘాలకు రూ.66.14 కోట్ల చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న పేద మమహిళలందరినీ లక్షాధికారులుగా చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇచ్చిన రుణంతో అభివృద్ధి సాధించాలన్నారు. సంపద సృష్టికి వ్యాపారాలు, వస్తువులు తయారీ యూనిట్లు స్థాపించాలన్నారు. గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న భవనాలను యూనిట్ల స్థాపనకు వినియోగించుకోవాలన్నారు. రిపేర్లకు, యూనిట్ల స్థాపనకు అవసమైన ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. నలుగురికి ఉపాధి చూపించే స్థాయికి సంఘాలు ఎదగాలన్నారు. మహిళా సంఘ సభ్యులందరూ అక్షరాస్యులుగా మారాలని, వారికి చదువు నేర్పే కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో వచ్చే ఐదేళ్లలో 15 మండలాల్లో 46,273 మంది సభ్యులకు లక్ష రూపాయలు ఆదాయం వచ్చేటట్టు, వారికి వివిధ రకాల రుణ సదుపాయం వచ్చేటట్టు, వారికి వివిధ రకాల రుణ సదుపాయం కల్పించి జీవనోపాధి కార్య క్రమాన్ని పెంపొందించి తద్వారా లక్షాధికారులుగా చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 5,512 మంది సభ్యులకు రూ.56.64 కోట్లు బ్యాంకు లింకేజీగా, 124 మంది సభ్యులకు సీఐఎఫ్ కింద రూ.60 లక్షలు, ప్రధాన మం త్రి ఉపాధి కల్పన కార్య క్రమం కింద 117 మందికి రూ.8.90 కోట్లు వెరశి 5,453 మందికి రూ.66.14 కోట్లు చెక్కును అందించారు. ఇందులో ఐదుగురు ఉత్తమ సభ్యులకు ఐదు గ్రామ సమాఖ్యలకు ప్రశంసాప త్రాలు అందించారు. ఈ కార్య క్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్

వైద్య సేవలు ఆలస్యంతోనే..

- బట్లభద్రలో తల్లీకుమార్తెల మృతి
- వైద్య ఆరోగ్యశాఖ వెల్లడి

జియ్యమ్మవలస, ఆగస్టు 25: వైద్య సేవలు అందించడంలో ఆలస్యం జరగడంతోనే బిత్రపాడు పంచాయతీ బట్లభద్ర గ్రామంలో తల్లీకుమార్తెలు మేరువ దుర్గమ్మ (47), మేరువ చైతన్య (20) మృతి చెందారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జగన్మోహన్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం బట్లభద్రలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుర్గమ్మ, చైతన్య మృతికి డెంగ్యూ కారణం కాదని తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వారికి చికిత్స అందించడంలో ఆలస్యం జరగడంతోనే మృతి చెందారని వెల్లడించారు. గ్రామంలో మొత్తం 25 మంది జ్వర పీడితులు ఉన్నట్లు గుర్తించి వారికి చికిత్స అందజేశారు. వాతావరణ మార్పులతో పాటు గ్రామంలో పారిశుధ్య లోపం కారణంగా జ్వరాలు విజృంభించాయని వెల్లడించారు. గ్రామమంతా స్ప్రేయింగ్ చేయించి ఫాగింగ్ కూడా చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని వారు కోరారు.



వైద్య శిబిరం వద్ద జిల్లా వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే.

బట్లభద్ర గ్రామంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం మధ్యాహ్నం పర్యటించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కాలువల్లో మురుగు నిలిచిపోవడంతో పాటు మేరువవాని బంద వ్యర్థాలతో నిండిపోవడంతో గ్రామంలో రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. మేరువాని బందను పూర్తిగా పూడ్చేయడానికి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతేకాకుండా నీరు నిల్వ ఉండిపోతున్న రెండు సీసీ రోడ్లు పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తిస్థాయిలో జ్వరాలు తగ్గుముఖం పట్టేంతవరకు గ్రామంపై పూర్తి దృష్టి సారించాలని ఆమె జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కోరారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న జ్వర పీడితులను గుర్తించి అక్కడ వారికి అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేయాలని కోరారు.

వైరల్ త్రంబోసైటోపినియ కారణం..

పార్వతీపురం, (ఆంధ్రజ్యోతి): బట్లభద్ర గ్రామానికి చెం దిన తల్లీకుమార్తె దుర్గమ్మ, చైతన్య వైరల్ త్రంబోసైటోపినియ కారణంగా మృతి చెందారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.విజయపార్వతి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'బట్లభద్ర గ్రామంలో ఈ నెల 13న ఇంటింటా జ్వరాల సర్వే చేపట్టాం. దుర్గమ్మకు జ్వరం ఉన్నట్టు గుర్తించాం. మలేరియా, డెంగ్యూ సందేహంతో ఆర్‌డీటీ పరీక్ష నిర్వహించాం. అందులో నెగిటివ్‌గా ఫలితం వచ్చింది. మాదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని సూచించాం. ఆమె పార్వతీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందింది. 22న విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. 23న ఉదయం వైరల్ త్రంబోసైటోపినియతో ఆమె మృతి చెందింది. దుర్గమ్మ కుమార్తె చైతన్యకు ఈ నెల 15న చేసిన ఆర్‌డీటీ పరీక్షల్లో సికిల్ సెల్ ఎనీమియాగా గుర్తించాం. సికిల్‌సెల్ ఎనీమియా తుది పరీక్షల నిర్వహణకు చైతన్య అంగీకరించలేదు. వెంటనే పార్వతీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఓపీ విధానంలో ఆమె చికిత్స పొందింది. 19న చేసిన పరీక్షల్లో వైరల్ త్రంబోసైటోఎనియ ఉన్నట్టు గుర్తించాం. 23 మధ్యాహ్నం ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అదే రోజు రాత్రి వైరల్ త్రంబోఐటోపినియతో చైతన్య మృతి చెందింది.' అని తెలిపారు.

దిక్సూచి DIKSUCHI



"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేక సార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింప జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

ఉమ్మడి పౌరస్మృతి

'ఒకే దేశం - ఒకే చట్టం'

ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తిహక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంబించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకో, టర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.

ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల లోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. ఏ వ్యక్తి

ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం

అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ..... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.


పర్సనల్ లాస్

మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్శీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎలిజిబిలిటీ టెస్ట్

రీజనింగ్

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.ఐ., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణా కాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.

ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.

ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.

ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు. మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

అటకెక్కిన 'ఫిష్ ఆంధ్ర'

వైసీపీ హయాంలో వస్తు సామగ్రి కొనుగోలులో భారీ అవినీతి

- లబ్ధిదారులకు భారమైన ఫ్రాంచైజీ, బ్రాండింగ్
- వినియోగదారుల నుంచి కరువైన ఆదరణ
- లక్షల్లో నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత



అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికే 'ఫిష్ ఆంధ్ర' అంటూ డప్పు కొట్టిన వైసీపీ ప్రభుత్వం... ఆచరణలో భారీ అవినీతికి తెరతీసింది. వైసీపీ పార్టీ రంగులతో, ప్రచార ఆర్భాటంతో ఆరంభమైన 2,300 యూనిట్లలో చాలా వరకూ మూతపడ్డాయి. లబ్ధిదారులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రూ.లక్షల్లో నష్టపోయారు. టీడీపీ ప్రభుత్వం దీనిపై దృష్టిపెడితే అవినీతి చేపలు దొరికే అవకాశం ఉంది. లబ్ధిదారులకు నగదు రాయితీ ఇచ్చి, నిర్దేశిత ప్రమాణాలతో రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పాల్సిన మత్స్య శాఖ... ఫ్రాంచైజీ రుసుము చెల్లించాలని, పరికరాలను తాము చెప్పిన సంస్థ నుంచే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడే అవినీతి, అవకతవకలకు ఆస్కారం ఏర్పడింది. 'ఫిష్ ఆంధ్ర' కాస్తా... 'స్కామ్ ఆంధ్ర'గా మారింది. వస్తు సామాగ్రిని తమకు అనుకూలమైన సంస్థల నుంచి కొనుగోలు చేయించి, నిధుల గోల్‌మాల్‌కు తెరదీశారు. బ్యాంకు రుణం, కేంద్రం, లబ్ధిదారుని వాటా నిధులతో వస్తు సామాగ్రి కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన తనవంతు వాటాను విడుదల చేయలేదు. లైవ్ ఫిష్ టబ్, బల్లలు, చేపలు శుద్ధి చేసే పనిముట్లు, శీతలీకరణకు రిఫ్రిజిరేటర్, ఐస్ తయారీ యంత్రం తదితర వస్తువులు... నాణ్యత ఏ మాత్రం లేని వాటిని ఎక్కువ ధరకు కొనుగోలు చేయించారు. లోగుట్టుగా అవినీతికి పాల్పడిన వైసీపీ నేతలు, అధికారులు... ప్రచారాన్ని మాత్రం ఊదరకొట్టారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,000 మందికి ఉపాధి లభించిందని వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. ఫ్రాంచైజీ పేరుతో ఆరంభంలో రూ.80 వేలు వసూలు చేసిన మత్స్య శాఖ... ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్ కోసం ప్రతి నెలా రూ.7,000 చెల్లించాలన్న నిబంధన పెట్టింది. ప్రారంభించిన కొద్ది నెలలకే కొనుగోలు చేసిన వస్తు సామాగ్రిలో చాలా వరకూ మూలకు చేరింది. నిర్వహణ భారమయింది. లైవ్ ఫిష్ వ్యాపారానికి ఆదరణ లభించలేదు. దీంతో ఫిష్ ఆంధ్ర అటకెక్కింది. మళ్లీ 20 వేల మంది రోడ్డుపైకి వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పథకం తీరుతెన్నులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అనేక అవకతవకలు బయటపడతాయి.

బడితో చెడుగుడు!

నాడు-నేడుపై జగన్ సర్కారు చెప్పినవన్నీ అబద్ధాలే

- ప్రచారం కోసం పథకాన్ని వాడుకున్న వైసీపీ పెద్దలు
- చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే నిలిపేసిన వైనం
- మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టని నేతలు
- జగన్ ప్రభుత్వంలో మూడు వేల కోట్లు పక్కదారి
- ఇప్పుడు వాటినేం చేయాలంటూ అధికారుల కసరత్తు
- పథకం పేరు 'మన బడి-మన భవిష్యత్తు'గా మార్పు
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నాడు-నేడు' పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేస్తామని గత జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అయితే ఇందులో ప్రచారం తప్ప పనులేం చేయలేదని తేలింది. చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే వదిలేసినట్లు వెల్లడైంది. ప్రభుత్వ బడుల్లో అద్భుతాలు అంటూ రాజకీయ లబ్ధి కోసం విశ్వప్రయత్నాలు చేసిన వైసీపీ పెద్దలు... వాటిలో మౌలిక సదుపాయాల పురోగతిపై దృష్టి పెట్టలేదు. దీంతో నాడు-నేడు మధ్యలోనే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచనా వేయగా నాడు-నేడు రెండో దశలో కేవలం 7.88శాతం పనులే పూర్తిచేసిన విషయం బయటపడింది. 22,311 బడుల్లో రెండోదశ పథకం ప్రారంభించగా కేవలం 1,759 బడుల్లో మాత్రం పనులు పూర్తయ్యాయి. 20,552 పాఠశాలల్లో మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు వాటినెలా పూర్తిచేయాలన్న దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. తొలుత కాంట్రాక్టు విధానంలో పనులు చేయించాలని యోచించినా, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని నిర్ణయానికొచ్చింది. కొత్తగా ఎన్నుకున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయాలని భావిస్తోంది. పనులు ఏ దశల్లో ఉన్నాయి? ఇంకా ఏ మేరకు నిధులు అవసరం? అనేదానిపై పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా 'నాడు-నేడు' పథకం పేరును 'మన బడి-మన భవిష్యత్తు'గా ప్రభుత్వం మార్చింది.

పనుల ప్రారంభంపైనా ఆరా

పనులు మధ్యలో వదిలేయడం ఒకెత్తు అయితే అసలు ఏ ప్రాతిపదికన బడుల్లో పనులు మొదలుపెట్టారనే అంశంపై కూడా పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. నాడు- నేడు పథకం ప్రారంభం నాటి అధికారులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఆ బాధ్యతల నుంచి తప్పుకొని వెళ్లిపోయిన వారిని కూడా పిలిపించారు. మొదటి, రెండో దశల్లో పనులు ప్రారంభానికి బడులను ఏ ప్రాతిపదికపై ఎంపిక చేశారో తెలుసుకుంటున్నారు. నాడు-నేడు పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశాక కొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. తరగతుల విలీనం ప్రక్రియ చేపట్టడంతో కొన్ని బడుల్లో విద్యార్థుల సంఖ్య జీరోకు చేరింది. దీంతో అక్కడి టీచర్లను ఇతర పాఠశాలలకు పంపి, ఆ బడులకు తాళాలు వేశారు. అయితే విద్యార్థుల సంఖ్య అంతంతమాత్రంగా ఉన్న బడులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలపై దృష్టి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మెరుగ్గానే ఉన్నా ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఏటా దిగజారుతోంది. విద్యార్థులు లేక ఆ బడులు వెలవెలబోతున్నాయి. 20 మంది విద్యార్థులు కూడా లేని బడులు దాదాపు దాదాపు 12వేల వరకూ ఉన్నాయి. వీటిలో కేవలం ఒక్కరే టీచరు ఉన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ బడుల్లోనూ ఒక్కో తరగతికి ఒక టీచర్‌ను నియమించే ఆలోచన చేస్తోంది. దాంతోపాటు అన్ని బడుల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని, వచ్చే ఏడాది నాటికి టీచర్లను పెంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నించాలని ప్రణాళికలు రూపొందిస్తోంది.



ఎక్కడి పనులు అక్కడే

45వేల ప్రభుత్వ బడుల్లో మొత్తం మూడు దశల్లో మౌలిక సదుపాయాల కల్పన పూర్తిచేస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో 15,715 బడుల్లో పథకం ప్రారంభించగా, దాదాపుగా పూర్తయ్యాయి. రెండోదశ పనులు 2022లో ప్రారంభించారు. 22,311 బడుల్లో వసతులు అభివృద్ధి చేయడంతో పాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. రూ.8వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ పనులకు ఇప్పటి వరకూ రూ.4,107 కోట్లు ఖర్చు చేశారు. అయితే రూ.7వేల కోట్లకు పైగా నిధులను వివిధ రూపాల్లో సమీకరించినా వాటిని పథకానికి వినియోగించకుండా పక్కదారి పట్టించారు. నిధుల లేమితో వేల సంఖ్యలో బడుల్లో పనులు మధ్యలో నిలిచిపోయి ప్రాంగణాలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, కడప, విజయనగరం, మన్యం మినహా ఏ జిల్లాలోనూ పది శాతం పనులు కూడా పూర్తికాలేదు.

156 ఔషధాలపై కేంద్రం నిషేధం!

- జాబితాను విడుదల చేసిన ఔషధ నియంత్రణ శాఖ

గుంటూరు(మెడికల్), ఆగస్టు 25: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 156 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) మందులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. తక్షణం వీటి తయారీ, పంపిణీ, విక్రయాలు నిలిపివేయాలని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిషేధించిన మందుల్లో పలు యాంటీ బయోటిక్, యాంటీ అలర్జీ, అధిక రక్తపోటు, నొప్పి నివారణ మందులు, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు తదితరాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన డ్రగ్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) సూచనల మేరకు ఈ మందులపై కేంద్ర ఆరోగ్య శాఖ నిషేధం విధించింది. ఈ మేరకు ఈనెల 12వ తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించింది. నిషేధ మందుల జాబితాను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. తాజాగా గుంటూరు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఆ నిషేధిత మందుల జాబితాను విడుదల చేశారు. వీటిని తక్షణం దుకాణాల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాదారులకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ మందుల కాంబినేషన్‌లో హేతుబద్ధత లేదని, పైగా రోగుల చికిత్సల్లో ఈ మందుల వినియోగం వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని డీటీఏబీ నిపుణులు పేర్కొన్నారు. బాగా ప్రాచుర్యంలో ఉన్న పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు నిషేధిత మందుల జాబితాలో ఉండటం విశేషం. మెఫనమిక్ యాసిడ్, పారా సిటమాల్ కాంబినేషన్ ఇంజెక్షన్లను సాధారణంగా నొప్పి నివారణకు వినియోగిస్తారు. ఈ కాంబినేషన్ మందు వల్ల రోగుల్లో తీవ్రమైన దుష్ఫలితాలు తలెత్తుతున్నట్లు నిపుణులు గుర్తించారు. అదే విధంగా ఎసిక్లోఫెనాక్, పారాసిటమాల్ కాంబినేషన్ చాలా సాధారణంగా వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. ఈ కాంబినేషన్‌పైనా ప్రభుత్వం నిషేధం విధించింది. మొటిమల చికిత్స, ముక్కు దిబ్బడ, చర్మవ్యాధుల చికిత్సల్లో వాడే ఔషధాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. గతంలో 2018లో కేంద్ర ప్రభుత్వం 328 ఎఫ్‌డీసీ మందులపై నిషేధం విధించింది. ఆరేళ్ల తర్వాత మరోసారి పెద్ద సంఖ్యలో మందులపై నిషేధం విధిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

1 నుంచి బీజేపీ సభ్యత్వం: పురందేశ్వరి



సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఆగస్టు 25: 'పదకొండవ ఆర్థిక శక్తిగా ఉన్నటువంటి భారతదేశాన్ని ప్రధాని మోదీ పాలనలో ఐదో ఆర్థిక శక్తిగా అవతరించి ప్రపంచ పటంలో ఆవిష్కరించింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మూడో ఆర్థికశక్తిగా చూడాలనే దిశగా బీజేపీ కూటమి ప్రయత్నిస్తోంది' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఆమె కాకినాడలో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించే పార్టీ సభ్యత్వ నమోదుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 37 లక్షల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు. కాగా, త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి తమ మేనిఫెస్టోలో ఆర్టికల్ 370, 35ఏలను పునరుద్ధరిస్తామని ప్రకటించడాన్ని బట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే రీతిలో వ్యవహరిస్తారని మండిపడ్డారు. దీనిపై రాహుల్ గాంధీ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ: భువనేశ్వరి



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేద అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ శిక్షణ ఉంటుందని, అర్హులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు.

ఇంటికి వస్తాడని ఎదురు చూస్తుంటే..

● విగతజీవిగా కనిపించిన కుమారుడు


రాధాకృష్ణ (ఫైల్)

కొత్తవలస: విధి నిర్వహణకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన కుమారుడు తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న ఆ తల్లిదండ్రులు... తమ బిడ్డ ఎప్పటికీ తిరిగి రాడని తెలిసి తల్లడిల్లుతున్నారు. కన్నబిడ్డ మృతి చెందిన తీరు చూసి షాక్‌కు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. కంటకాపల్లి పంచాయతీ కొత్తూరు గొప్పు గ్రామ సమీపంలోని మామిడితోటలో యువకుని మృతదేహాన్ని ఆదివారం స్థానికులు చూశారు. ఆ యువకుడిని కొత్తూరు గొప్పు గ్రామానికి చెందిన దుక్క రాధాకృష్ణ(18)గా గుర్తించారు. మృతుడి తల చెట్టుకు వేలాడుతుండగా.. మిగిలిన శరీర భాగమంతా కింద పడి ఉంది. దీంతో యువకుడు హత్యకు గురయ్యాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు... పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం దుక్క రాధాకృష్ణ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. చెడు వ్యసనాలకు లోనై అప్పులు చేశాడు. కొంతమందితో తరచూ గొడవలు పడుతుండేవాడని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం లారీలో క్లీనర్‌గా పని చేస్తున్నాడని తండ్రి దుక్క అప్పలరాజు తెలిపాడు. ఈ నెల 10న ఇంటి నుంచి విధులకు బయలుదేరి వెళ్లాడని... 15 రోజుల తరువాత వస్తాడని ఎదురు చూస్తున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమారుడు ఇలా విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఈ నెల పదో తేదీనే చనిపోయి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుళ్లిపోయినందునే తల, మొండెం వేరై ఉండొచ్చునని భావిస్తున్నారు. మృతిచెందిన రాధాకృష్ణకు తమ్ముడు ఉన్నాడు. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీఐ షణ్ముఖరావు, ఎస్ఐ సుదర్శనరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట సీహెచ్‌సీకి తరలించినట్టు చెప్పారు.


స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వివాహిత అదృశ్యం

రామభద్రపురం: మండల కేంద్రానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్టు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కోటిపల్లి సుజాత (28)కు బొబ్బిలి మండలం ముత్తాయివలస గ్రామానికి చెందిన కోటిపల్లి ప్రసాద్‌తో కొన్నేళ్ల కిందట వివాహమైంది. ఇటీవల కన్నవారింటికి వచ్చిన ఆమె ఈ నెల 19న తిరిగి అత్తవారింటికి బయలుదేరింది. ఆమె ఇప్పటికీ ఇంటికి చేరలేదని అత్తింటి వారు తల్లికి ఫోన్‌లో తెలిపారు. బంధువుల ఇళ్లలో వాకబు చేయగా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వృద్ధుడు

గజపతినగరం: మదుపాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి మోటారు సైకిల్ ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు మండలంలోని బంగారమ్మపేట గ్రామానికి చెందిన కాళ్ల రాములు (75) శనివారం రాత్రి గజపతినగరం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మదుపాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారి దాటుతుండగా పెదమానాపురం నుంచి గజపతినగరం వైపు వస్తున్న మోటారు సైకిలిస్టు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రాములు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి పెద్ద కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గంజాయితో చిక్కిన యువకులు

డెంకాడ: విజయనగరం పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు గంజాయి తాగడానికి శనివారం రాత్రి వెళుతుండగా గుణుపూరు కూడలి వద్ద స్థానిక ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు, సిబ్బంది పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 300 గ్రాముల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లి... బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు.

గూడ్స్‌రైలు ఢీకొని వ్యక్తి మృతి

బొబ్బిలి: దిబ్బగుడ్డివలస రైలు గేట్ ఎన్‌సీ వద్ద శనివారం రాత్రి 7 గంటల సమయంలో గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... బొబ్బిలి పట్టణానికి చెందిన ధర్మవరపు చిన్నారావు (74) వృత్తి రీత్యా కరెంటు పనులు చేస్తుంటారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తండ్రీ కొడుకులు ఇద్దరూ కరెంటు పనులు చేస్తుంటారు. శనివారం దిబ్బగుడ్డివలసకు కరెంటు పనులకు ద్విచక్ర వాహనంపై చిన్నారావు వెళ్లాడు. రాత్రి 9 గంటల వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆయన భార్య సత్యవతి...తండ్రిని వెదికేందుకు కుమారుడిని పంపించడంతో విషయం తెలిసింది. సమాచారం అందుకున్న ఆర్‌పీ హెచ్‌సీ బి.ఈశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళ..

కురుపాం రూరల్: మొండెంఖల్ గ్రామానికి చెందిన గౌడు బుజ్జీలు(32) విద్యుదాఘాతంతో ఆదివారం మరణించింది. తన తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోలేదని పరామర్శించేందుకు ఒడిశా నుంచి శనివారం మొండెంఖల్ వచ్చింది. తమ ఇంటిలో ఎక్కడ చూసినా కరెంట్ షాక్ కొడుతుండడంతో లైన్‌మేన్‌కు ఫోన్ చేశారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇంటిలో విద్యుత్ వైర్లను బుజ్జి కదిలిచింది. వెంటనే షాక్ గురైంది. ఆమెను కాపాడడానికి ప్రయత్నించిన తండ్రి కేశవ, తల్లి విన్నీ చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. వారికి స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. నీలకంఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చింతలపాలెంలో కొనసాగుతున్న పోలీసు పికెట్

కొత్తవలస: చింతలపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో టీడీపీ సర్పంచ్ మాకెన సీతారామపాత్రుడుపై వైసీపీకి చెందిన యువకులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోందని సీఐ షణ్ముఖ రావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటికే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినందున.. మళ్లీ గొడవలకు ఆస్కారం ఉందేమోనని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. టీడీపీ, వైసీపీ వర్గాలు సంయమనం పాటించాలని ఆయన సూచించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి..

శ్రీనగర్ (విశాఖపట్నం): విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ నగరంలోని 71వ వార్డు పరిధి దిబ్బపాలేనికి చెందిన జి.దీపేశ్ (9) ఆడుకునేందుకు శనివారం సాయంత్రం డాబాపైకి వెళ్లాడు. ఆ సమయంలో ఆ బాలుడి చేతిలో ఓ వైరు ఉంది. దాంతో ఆడుకుంటుండగా దీపేశ్‌కు ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టడంతో కిందపడిపోయాడు. ఆ డాబాకు సమీపంలోనే 11కేవీ హెచ్‌టీ వైర్లకు ప్రమాదవశాత్తు బాలుడి చేతిలోని వైరు తగలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు పేర్కొంటున్నారు. దీపేశ్‌ను తండ్రి త్రినాథరావు హుటాహుటిన గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున దీపేశ్ మృతి చెందాడు. త్రినాథరావు విజయనగరం జిల్లా గుర్ల మండలంలోని గవిడిపేట నుంచి 20 ఏళ్ల కిందట బతుకుతెరువు కోసం గాజువాక ప్రాంతానికి వచ్చారు. స్టీలుప్లాంటులోని ఓ క్యాంటీన్‌లో కాంట్రాక్టు కార్మికునిగా ఆయన పని చేస్తున్నారు. దిబ్బపాలెంలో ఆరేళ్లగా భార్య, ఇద్దరు కుమారులైన దీక్షిత్, దీపేశ్‌తో ఉంటున్నారు. అప్పటివరకు తమ కళ్లముందే కదలాడిన కుమారుడు కానరాని లోపాలకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బీసీ భవన్ నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించాలి

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలో బీసీ భవన నిర్మాణానికి రూ.ఐదు కోట్లు కేటాయించాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు కెల్ల శ్రీనివాసరావు, జి.రమేష్, జి.సూరిబాబులు డిమాండ్ చేశారు. బీపీ మండల్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రనాయుడు, హరి, కళ్యాణ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల నిర్వహణ తీరు అద్భుతం

విజయనగరం రూరల్: ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)లో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలుగా గ్రామసభలు ఏర్పాటు చేయడం అద్భుతమని.. ఇది చరిత్రాత్మక ఘట్టమని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామసభల ఊసే లేకుండా పోయిందన్నారు. అంతా పారదర్శకంగా జరగాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు సమష్టిగా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ఆల్తి బంగారుబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ఆటల పోటీలతో ఐక్యత


క్రికెట్ పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

రాజాం: ఆటల పోటీలు ఐక్యతను పెంపొందిస్తాయని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. రాజాం నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న క్రీడా పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా క్రీడా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఉపాధ్యాయుల ఐక్యతకు నిదర్శనమని చెప్పారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం జీవో నెంబరు 117ను రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహన్‌రావు, ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ పట్నాయక్, పక్కి వాసు, బి.రామినాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ చుక్క వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు..

బొబ్బిలి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు విజయగౌరి మొక్కలు నాటడంతో పాటు క్రీడాపోటీలను ప్రారంభించారు. చదరంగం, రింగ్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం తదితర పోటీలలో మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాధ్యక్షులు పి. కస్తూరి, జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వీ రమణమూర్తి, సామాజిక కార్యకర్త కృష్ణదాసు, యూటీఎఫ్ నాయకులు ఆనెం శ్రీనివాస్, సుధాకర్, వెంకటరావు, రామారావు, మాలతి, స్వప్న, సుజాత, తదితరులు పాల్గొన్నారు.


టగ్ ఆఫ్ వార్‌లో పోటీ పడుతున్న ఉపాధ్యాయినులు


విద్యుత్ కాంతుల్లో కోట అందాలు

విద్యుత్ వెలుగుల్లో కోట

విజయనగరం రూరల్: విజయనగరంలోని చారిత్రక కట్టడం కోట.. విద్యుత్ వెలుగులతో విరాజిల్లుతోంది. పూసపాటి వంశీయులు అలక్‌నారాయణ గజపతిరాజు జయంతిని పురస్కరించుకుని మాన్సాస్ ట్రస్టు కోటను ప్రత్యేకంగా అలంకరించింది. ఆదివారం సాయంత్రం కోట వెలుగులను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల వారు తరలివచ్చారు. అలక్‌నారాయణ గజపతిరాజు జయంతిని పురస్కరించుకుని.. పీవీజీ రాజు శత జయంతి ఉత్సవాలకు సంబంధించి రూపొందించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం కోటలో జరగనుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు హాజరు కానున్నారు.

బుచ్చింపేటలో వైద్య శిబిరం

సీతానగరం: దయానిధిపురం పంచాయతీ బుచ్చింపేట గ్రామంలో పెదంకలాం పీహెచ్‌సీ వైద్యురాలు రాధాకాంత్ ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన యువతి జి.సాయికుమారి ఈనెల 23న జ్వరంతో బాధపడుతూ మృతిచెందిన నేపథ్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 30 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, ఎవరికీ జ్వర లక్షణాలు లేవని ఆమె చెప్పారు. గ్రామంలో వారం రోజుల పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటుందని ఆమె తెలిపారు. సర్పంచ్ రామారావు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు.


గ్రామంలో పర్యటిస్తున్న వైద్యులు, సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం రింగురోడ్డు: పిల్లలకు వైద్యులు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కంటోన్మెంట్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో ఐఏపీ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునాతన వైద్య పద్ధతులతో పిల్లలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ జాతీయ అధ్యక్షుడు జీవీ బసవరాజు, ఐఎంఏ పిడియాట్రిక్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ డీవీ శ్రీకాంత్, కార్యదర్శి రెహ్మాన్, ప్రతినిధులు శేషగిరి, గోపాలరావు, వీఎస్ ప్రసాద్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు పాల్గొన్నారు.

హిందువులపై దాడి అమానుషం

పాలకొండ: హిందువులపై దాడి అమానుషమని హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించి, ఏలాం జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటుచేశారు. హిందువుగా జీవించు, హిందువుగా గర్వించు అంటూ నినాదాలు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని ఖండించారు.


ఏలాం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మరణాలపై దర్యాప్తు చేపట్టాలి


విలేకరులతో మాట్లాడుతున్న కుమార్

బెలగాం: జిల్లాలో ఇటీవల ఒకే ఇంట్లో ఒకే రోజు వ్యవధిలో తల్లి, కూతురు చనిపోయిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీపై విచారణ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జియ్యమ్మవలస మండలం బట్టలభద్ర గ్రామానికి చెందిన తల్లి, కూతురు 24 గంటల వ్యవధిలో మృతిచెందిన ఘటనపై విచారణ జరిపించాలని కోరారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

రాజాం రూరల్: బొద్దాంలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 3 వరకూ తొమ్మిది రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక సభ్యులు రామినాయుడు, మోహనరావు, గణపతిరావు,రామకృష్ణ తదితరులు ఓ ప్రకటనలో తెలియజేశారు. తొమ్మిది రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీఐని కలిసిన మాజీ సైనికులు

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పట్టణ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కె.సతీష్ కుమార్‌ను వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షులు రేవళ్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘ సభ్యులు కలిసి మొక్కను బహూకరించి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు గోవిందనాయుడు, వీఎస్ శర్మ, పురుషోత్తం, శ్రీనివాసరావు, సురేష్ బాబు, సీహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

28న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

బొబ్బిలి రూరల్: బొబ్బిలి రూరల్ సబ్ డివిజన్ విద్యుత్ సంస్థ కార్యాలయ ఆవరణలో ఈ నెల 28న సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు సంబంధిత అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రామభద్రపురం, బాడంగి, తెర్లాం విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి సంగం వీధిలో ఆదివారం విశాఖపట్నంలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్, సాలూరుకు చెందిన నవజీవన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. ప్రధానంగా క్యాన్సర్, కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. 21 మందికి ఉచిత శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్యాన్ని అందించేందుకు విశాఖలో గల గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, పుష్పగిరి సంస్థలకు తరలించారు. నవజీవన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చిక్కాల చిన్నమ్మలు, డాక్టర్లు డి.సుభద్ర, ఎం.సుధానంద, సుకన్య, కో ఆర్డినేటర్ సీహెచ్ స్వాతి శ్రీ, జాషువా సాహిత్య పీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోరు సాంబయ్య, బొద్దాన అప్పారావు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ ఎంపీలు రాజీనామా చేయాలి'

వేపాడ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం తీర్పును నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ ఎస్సీ, ఎస్టీ ఎంపీలు రాజీనామాలు చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత కూలీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. అరిగిపాలెంలో గల ఆయన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల ఐక్యతను, అభివృద్ధిని దెబ్బ తీసేందుకు కుట్ర పన్నిన నరేంద్రమోదీ సారధ్యంలోని బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. దళిత ఎంపీలు రాజకీయాలకు, పదవులకు బానిసలై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం ఘోరమన్నారు. న్యాయ స్థానం ఈ తీర్పును తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు.

దళితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

విజయనగరం దాసన్నపేట: ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడిమాంబ ఆలయంలో గత 200 ఏళ్లుగా పాలధార, చాటింపు, దేవర ఉత్సవంలో సేవలు చేస్తున్న దళితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంగా భానుమూర్తి కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణను పైడి మాంబ ఆలయం వద్ద కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కానిస్టేబుల్ చలపతి రావును వీరబొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షులు రేవళ్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇటీవల అలజంగి-పాల్తేరు గ్రామాల మధ్య కల్వర్టులో పడి ఉన్న గుర్తు తెలియని మృతదేహాన్ని తరలించడానికి రవాణా సౌకర్యం లేకపోయింది. దీంతో కానిస్టేబుల్ చలపతి కిలోమీటరు మేర తన భుజాలపై మృతదేహాన్ని మోసుకొని పోలీసు వాహనం వద్దకు తీసుకువెళ్లారు. మానవత్వంతో స్పందించిన కానిస్టేబుల్‌ను ఎస్ఐ లోవరాజు సమక్షంలో ఆదివారం సైనిక సంక్షేమ సంఘ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గోవిందనాయుడు, ట్రెజరర్ వీఎస్ శర్మ, మాజీ సైనికులు పి.సురేష్ బాబు, ఎస్.పురుషోత్తం, గెంబలి శ్రీనివాసరావు తదితురులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం అవసరం

రామభద్రపురం: విద్యార్థులకు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం అవసరమని కొట్టక్కి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రావాడ భాస్కరరావు తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (విజయవాడ) వారి ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ టూర్ కోసం బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న బెర్రీ ఎల్లాయిస్ పరిశ్రమను ఆదివారం విద్యార్థులు సందర్శించారు. వీరికి నీరజ్‌కుమార్ సంధానకర్తగా వ్యవహరించారు. సంస్థలోని ఫెర్రో మాగ్నిస్ తయారీ గురించి పూర్తిగా వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు షేక్ షరీఫ్, బొత్స రత్నకిశోర్ వీరికి సహకరించారు.

ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో తోటపల్లి అభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ తోటపల్లి అభివృద్ధి ట్రస్ట్‌తో పాటు మనోబంధు సంస్థ మారు మూల గ్రామాల్లో వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. శిబిరానికి హాజరైనవారికి ఉచితంగా మందులతో పాటు భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, బి.రామకృష్ణంరాజు, డాక్టర్ డి.పారినాయుడు, పలువులు వైద్యులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే జగదీశ్వరి


మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి: గ్రామాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం పలు ప్రణాళికలు రూపొందిస్తోందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. ఆదివారం తోటపల్లిలో లఖ్‌పతి దీదీ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా 276 స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీనిధి పథకాలకు సంబంధించి రూ.12,24,58,000లు చెక్కును ఆమె అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఎం.పురుషోత్తంనాయుడు, నాగూరు, తోటపల్లి ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, మరడాన సింహాచలం, సర్పంచ్ ఆవాల సింహాచలం, కన్నయ్య, డాక్టర్ డి.పారినాయుడుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో..


చెక్కును అందిస్తున్న దృశ్యం

వీరఘట్టం: మహారాష్ట్రలోని జలగం గ్రామంలో ఆదివారం ప్రారంభించిన ప్రధానమంత్రి లఖ్‌పతిదీదీ కార్యక్రమాన్ని వీరఘట్టం మండలంలోని వెలుగు కార్యాలయ సమావే శ మందిరంలో మహిళా సంఘాల సభ్యులు వీక్షించారు. ప్రతి మహిళను లక్షాధికారి చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. అనంతరం మహిళలకు రూ.1కోటి 35లక్షల చెక్కును అందించారు. ఈ కార్య క్రమంలో ఏపీఎం శివన్నా యుడు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, హరిబాబు, లలితమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న సురేంద్ర మోహన్

బెలగాం: దేశవ్యాప్తంగా సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 40 రోజుల పాటు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సభ్యత్వ నమోదు జోనల్ ఇన్‌చార్జి కె.సురేంద్రమోహన్ అన్నారు. ఆదివారం పార్వతీపురంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా సురేంద్ర మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరేళ్లకొకసారి బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతుందని తెలిపారు. ఈసారి సెప్టెంబరు 1 నుంచి 25 వరకు, అక్టోబరు 1 నుంచి 15 వరకు 40 రోజుల పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. గతంతో కంటే ఎక్కువగా 30 కోట్ల మందితో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని లక్ష్యంతో పని చేయాలని బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక


ఎన్నికైన వారిని సత్కరిస్తున్న దృశ్యం

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక పాలకొండలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడిగా పల్లా కొండబాబు, జిల్లా అధ్యక్షుడిగా కోడి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా వెన్నపు చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సీనియర్, జూనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి వెన్నపు చంద్రశేఖర్ మాట్లాడుతూ మన్యం జిల్లాలో కబడ్డీ క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రభుత్వం, పెద్దలు సహకారంతో మెరుగైన సదుపాయాలు కోసం కృషి చేస్తామన్నారు.

పీఈటీల జిల్లా కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా పీఈటీ అసోసియేషన్ జిల్లా సమావేశం ఆదివారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విక్రం అరుణ్ భాస్కర్, కార్యదర్శిగా పత్తిక చంద్రమోహన్, కోశాధికారిగా అరుణశ్రీలను ఎన్నుకున్నారు. రాష్ట్ర పరిశీలకులు చల్లా జగదీష్, బల్ల రమేష్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గరుగుబిల్లి: కొత్తపల్లి గ్రామానికి చెందిన గొడే భాస్కరరావు ఇటీవల మృతిచెందడంతో మండల కళింగ వైశ్య సంఘం తరఫున పెద్ద కర్మ నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.18వేలు సాయం అందజేశారు. కళింగ వైశ్య సంఘం మండల నాయకులు వడ్డీ మహేశ్వరరావు, వారణాశి కృష్ణమూర్తి, కొత్తకోట జనార్థనరావు, దేవరశెట్టి శ్రీనివాసరావుతో పాటు గరుగుబిల్లి గ్రామ కళింగ వైశ్య సంగం అధ్యక్షుడు కొత్తకోట వెంకటరమణ, సభ్యుల ఆధ్వర్యంలో భాస్కరరావు కుమారుడికి ఈ మొత్తాన్ని అందజేశారు.

యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు


పూడికతీత పనులు చేపడుతున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: మున్సిపాల్టీలోగల ప్రధాన రహదారితో పాటు 30 వార్డుల్లోని కాలువల్లో యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ ప్రధాన రహదారిలోని రాయగడ శివారు నుంచి పాతబస్టాండ్ వరకు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టామని చెప్పారు. వర్షాకాలంలో ప్రధాన రహదారితో పాటు ఆయా వార్డుల్లోని వీధుల్లో ఉన్న కాలువల్లో పూడికలు తీస్తామన్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు పరిసరాల శుభ్రత పాటిస్తూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ● **వీరఘట్టం:** నడిమికెళ్ల పంచాయతీ పరిధిలో నిడిమికెల్ల, కడకెల్ల గ్రామాలను వీధి కాలువల ఆదివారం పూడికలు తొలగింపజేశారు. పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు పర్యవేక్షించారు.


ప్రమాదకర రీతిలో వాహనాల రాకపోకలు

రాళ్లు తేలిన మంత్రజల రహదారి

రోడ్డు లేక.. ఫలసాయం అమ్ముకోలేక

● అత్యవసర సయయంలో గర్భిణుల ఇక్కట్లు

● మంత్రజల కొండ శిఖర గిరిజనులు అవస్థలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మంత్రజల కొండ శిఖర గిరిజనులు పక్కా రోడ్డు లేక అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా అటవీ ప్రాంతంలో సేకరించిన ఫలసాయం పక్కా రహదారి లేకపోవడంతో గుమ్మలక్ష్మీపురం తీసుకువచ్చి అమ్ముకోవడానికి ఇబ్బందిపడుతున్నారు. దీంతో కొందరు తక్కువ ధరకు దళారులకు విక్రయంచాల్సివస్తోందని వాపోతున్నారు. 300 మంది గిరిజనులు నివసిస్తున్న గ్రామానికి పక్కా రహదారి నిర్మాణానికి టీడీపీ హయాంలో ఐదేళ్ల కిందట నిధులు మంజూరయ్యాయి. కొంతమేర పనులు చేపట్టారు. ఇంతలో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు నిర్మాణంపై ఆశలు చిగురించాయని గిరిజనులు చెబుతున్నారు. అంతేకాకుండా అత్యవసర సమయంలో గర్భిణులను సైతం డోలీల్లో తీసుకురావల్సివస్తోంది. ఆ సమయంలో అవస్థలు తప్పడంలేదని పలువురు వాపోతున్నారు. గ్రామస్థులు గుమ్మలక్ష్మీపురం చేరుకోవాలంటే సుమారు ఐదు కిలోమీటర్లు దూరం దేరువాడ వరకు నడిచి రావాలి. అక్కడ నుంచి మరో వాహనంలో మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. పీహెచ్‌సీ సబ్ సెంటర్ కూడా దేరువడలో ఉండడంతో అక్కడకు రావాల్సి వస్తోంది. అంతేకాకుండా ప్రతి నెలా జీసీసీ డిపో ద్వారా అంతే నిత్యావసర సరుకులకోసం రాళ్ల రప్పల గుండా గ్రామస్థంతా దేరువాడ వస్తున్నారు. అక్కడి నుంచి కొండలపై నుంచి సరుకులు మోయాల్సి వస్తోందని వాపోతున్నారు. కాగా ఈ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. మంజూరైన వెంటనే పనులు చేయిస్తామని చెప్పారు. కొండ శిఖర గ్రామాలకు రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి

సాలూరు రూరల్: ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)కు ఏపీటీఎఫ్(257) వ్యతిరేకిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మర్రాపు మహేష్, నల్లా బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం ఆమోదిం చిన జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీం)కు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన యూపీఎస్ కు పెద్దతేడా లేదన్నారు. పాత పింఛన్ విధానానికి ఇవేవి ప్రత్యామ్నయాలు కాబోవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని సర్వీస్ కాల వ్యవధితో సంబంధం లేకుండా అమలు చేయాలని కోరారు. ● **బెలగాం:** కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో యూపీఎస్ అమలు చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు వచ్చే ప్రయోజనం ఏమీ లేదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ మన్యం జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో చేపట్టిన చర్యల వల్ల విద్యారంగం విచ్ఛిన్నమైందని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని చెప్పారు. అక్టోబరు 20, 21 తేదీలలో జరిగే సర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.మురళీమోహన్‌రావు, ఎస్.కిషోర్, ఎ.బాస్కర రావు తదితరులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** యూపీఎస్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మరోసారి ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాన్ని మోసం చేయడాన్ని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఖండిస్తుందని బీటీఏ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తందాడి అనీల్‌కుమార్, గొల్ల ఉమామహేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ఎన్నికలకు ముందు ఏకీకృత పెన్షన్ విధానం పేరుతో కేంద్రం మోసానికి దిగడం సరికాదన్నారు. పాత పెన్షన్ విధానం కోసం దశాబ్దాల నుంచి పోరాటం చేస్తుంటే పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు.

ఘనంగా దేశమ్మతల్లి వారాల పండగ

మక్కువ: మండల కేంద్రంలో దేశమ్మతల్లి వారాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక జన్నివీధిలో పూజారి కాత కృష్ణమూర్తి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘటాలు, ప్రభను ప్రధాన రహదారుల వెంబడి మేళతాళాలతో ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో ఘటాలకు పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న అమ్మవారి గద్దె వద్ద ఘటాలను ఉంచారు. ఎస్ఐ పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, టీడీపీ నాయకుడు మావుడి ప్రసాదరావు పాల్గొన్నారు.


ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఉచిత ఆరోగ్య సేవల బస్సు ప్రారంభం


బస్సును ప్రారంభిస్తున్న అతిథులు

రాయగడ: సత్యసాయి సేవా ట్రస్టు తరఫున ఆదివారం స్థానిక సత్యసాయి మందిరంలో ఉచిత ఆరోగ్య సేవల బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి రాష్ట్ర అధ్యక్షుడు డా.సత్యస్వరూప్ పట్నాయక్, నారాయణ ప్రసాద్, డా.పీకే దాస్, మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఛైర్మన్ టి.శ్రీనివాసరావు, సీఈవో సత్యనారాయణ, ఎస్పీ హరీష్ బీసీ, డాక్టర్ వీఎల్ఎన్ పృష్టి అతిథులుగా పాల్గొని జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈసందర్భంగా సత్యసాయి సేవా సమితి భక్తులు మాట్లాడుతూ ఈ బస్సు ప్రతి ఆదివారం గ్రామాలకు వెళ్లి ఉచితం గా వైద్యసేవలు అందించడంతో పాటు మందులు అందజేస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలు ఆరోగ్యం కోసం రూ.5కోట్ల వ్యయంతో అధునాతన వైద్య సౌకర్యాలతో ఈ బస్సును తయారు చేసి మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ అందజేసిందని చెప్పారు. ఈ బస్సులో బీపీ, సుగర్, మలేరి యా తదితర రోగాలకు రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నామని తెలిపారు. రాయగడ సత్యసాయి సేవాస మితి జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

ఒడిశా

బాధితులకు సాయం


చెక్కు అందజేస్తున్న జేసీ సంఘమిత్రదేవి

రాయగడ: కళ్యాణ సింగుపూర్ సమితి కొల్నాయి గ్రామంలో ఈనెల 9వ తేదీన ఇంటిగోడ కూలిన ఘటనలో బూర్జవాడక కుటుం బ సభ్యులు తీవ్ర గాయాల పాలయ్యారు. కుటుంబ సభ్యుల్లో ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా, ముగ్గురు చికిత్స పొం దుతూ ఉన్నారు. విషయం తెలిసిన సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘ మిత్ర దేవి జిల్లా కేంద్రాసుపత్రికి చేరుకుని, బాధితులను పరామర్శించారు. కలెక్టర్ పారుల్ పట్వార్ ఆదేశాల మేరకు బాధితులకు రెడ్‌క్రాస్ నిధుల నుంచి రూ.10వేలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.30వేలు సాయం అందజేశారు. అత్యవసర సేవల అధికారి లలితమండల్, జిల్లా ప్రాజెక్టు అధికారి జ్యోతిర్మయి బాధితులను పరామర్శించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి


సీతానగరం, సీతంపేట: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐలు రాజేష్, జగదీష్‌నాయుడు

సీతంపేట: ద్విచక్ర వాహనదారులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జగదీష్‌నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ అడ్వంచర్‌పార్క్ సమీపంలో ద్విచక్ర వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** పట్టణంలో ఎస్ఐ కె.కళాధర్ ఆదివారం వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని సూచించారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ● **సీతానగరం:** జోగింపేట కూడలి వద్ద ఎస్ఐ ఎం.రాజేష్ ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించి, కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించని ఎడల కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.


వీరఘట్టంలో..

ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్ర అభినయ పోటీలు

● వచ్చేనెల 22న నిర్వహణ


పీజీ నాయుడు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలో శ్రీవాణి ఆర్ట్స్ 11వ వార్షికోత్స వం సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయిలో పౌరాణిక ఏకపాత్ర అభినయ పోటీలు నిర్వహిస్తున్నట్టు శ్రీవాణి ఆర్ట్స్ వ్యవస్థాపక ఫిల్మ్ ఆర్టిస్ట్ అధ్యక్షుడు డా.పీజీ నాయు డు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 22వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 25 ఏకపాత్రులు మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. ఆడియో/వీడియో ద్వారా రెండు పద్యాలు గానీ రెండు డైలాగ్‌లు గానీ 9440012010, 95550754406 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చునన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.5,200, ఇత్తడి కిరీటం, ద్వితీయ బహుమతి రూ.3,400 పాటు షీల్డ్, తృతీయ బహుమతి కింద రూ.2,500 నగదు, షీల్డ్, నాలుగు ప్రత్యేక బహుమతులు కింద ఒక్కొక్క దానికి రూ.1600 ఇస్తామని తెలిపారు. ఈనెల 28న బుధవారం సాయంత్రం ఐదు గంటల లోపు వీడియో గానీ ఆడియో గానీ రికార్డు చేసి వాట్సప్‌కు పంపించాలని సూచించారు.

క్లుప్తంగా..

29న ఉచిత దంత వైద్యశిబిరం

పార్వతీపురంటౌన్: స్థానిక రైతుబజారు సమీపంలోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఈనెల 29వ తేదీన మెగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తామని ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్నాథం, గణపతిరావు ఆదివారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆర్టీసీ, పోలీసు, తదితర శాఖల ఉద్యోగులకు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

చినమేరంగి ఎస్ఐకి బదిలీ

జియ్యమ్మవలస: చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు బదిలీ అయ్యారు. ఈయనని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. ఆదివారం ఆయన చినమేరంగి పోలీస్‌స్టేషన్ నుంచి రిలీవ్ అయి వెళ్లారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్ఐగా ఎం.తమ్మయ్య వ్యవహరిస్తున్నారు.

ఆర్థికసాయం చేసిన ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం పట్టణానికి చెందిన రామ్మోహన్‌రావు అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే జగదీశ్వరి ఆర్థిక సాయం చేశారు. ఆదివారం గుమ్మలక్ష్మీపురం వచ్చిన బాధితులకు ఆమె తన మొదటి జీతం నుంచి రూ.10వేలు అందజేశారు. తాను పేదలకు అన్ని వేళలా అండగా ఉంటానని తెలిపారు.

ఘనంగా సుదర్శన హోమాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయి బాబా ఆలయంలో ఆదివారం సుదర్శన హోమాలను ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కృష్ణుని చిత్రం


గోరుతో వేసిన కృష్ణుని చిత్రం

గరుగుబిల్లి: చిలకాం గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి జశిత అనే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని చిత్రీకరించిన నఖ చిత్రం ఎంతగానో ఆకట్టుకుంది. సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని చిత్రీకరించినట్టు చెప్పింది. ఈమె నాగూరుకు చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు వద్ద నఖ చిత్రాలను నేర్చుకుంటోంది.